# మినీ కథ

# ఆమె



## సారె రామమోహనరావు

ఆ రోజు ఆమె సత్యమూర్తికి సరస్వతీ జంక్షన్ పార్కు వద్ద కనిపించింది. ఆమె అతనికి కనిపించింది త్రుటికాలమే అయినా, ఆమెరూపం అతని మనసులో చాలా కాలంపరిచయం వున్న దానిలా హత్తుకు పోయింది. ఆమెని చూడగానే సత్యమూర్తికి చాలాజాలికలిగింది. ఎవరో తనహృదయాన్ని గట్టిగా సూదితో గుచ్చినంతగా బాధపడ్డాడు.

ఆమె చాలా అందంగా వుంది. కాని నుదుట తిలకం లేదు. కళ్ళకు కాటుక లేదు. కొప్పున పూలులేవు. చేతులకు గాజులులేవు. మెడలో మాంగల్యం లేదు. తెల్లచీర, తెల్ల జాకెట్టు ధరించివుందామె. ఇరవై ఏళ్ళ కంటే ఎక్కువుండవామెకి.

చక్రాల్లాంటి కనులు, సంపెగలాంటి నాసిక... గులాబీల బుగ్గలు... పాములాంటి జడ... బంగారుమేని ఛాయ... వీటి నన్నిటినీ మించిన చక్కని పర్సనాలిటీ... ఎంతో అందంగా వుందామె.

సత్యమూర్తి బరువుగా బాధగా, నిట్టూర్చాడు.

ఇంత చిన్న వయసులోనే భగవంతుడు ఈమెకి భర్తని దూరంచేసి, ఎంత అన్యాయం చేశాడు. ఇంత అందమైన వడతికి ఇంత చిన్నవయసులోనే వైధవ్యమా?

ఆమెని తలుచుకుంటూంటే అతని మనసులో చెప్పలేని బాధావీచికలు తరంగాల్లా కదలాడాయి.

మర్నాడు కూడా ఆమె అతనికి అదే జంక్షన్‌లో ఎదురుపడింది. అతని పక్కనుంచి ముందుకి వెళ్ళిపోయింది. పాములాంటి జడ పిరుదుల మీద లయబద్ధంగా నాట్యంచేస్తూ ఆమె హంసలాంటి నడక సత్యమూర్తిని ముగ్ధుడినిచేసింది.

మోమున తిలకం దిద్ది... కళ్ళకు కాటుకతో... కొప్పులో పూలతో... మెడలో ఆభరణాలతో ఈమెను సర్వాలంకరణభూషితను చేస్తే ఎలా వుంటుంది?

రంభలా వుంటుంది...

సత్యమూర్తి ఆమెని అలంకరణాలతోను, ఆభరణాలతోను వూహించుకున్నాడు.

మర్నాడు ఆ మర్నాడు కూడా ఆమె అతనికి కనిపించింది.

అది మొదలు సత్యమూర్తి, ప్రతిరోజు సరస్వతీ జంక్షన్ పార్కు దగ్గర ఆమెని చూడటం దినచర్యగా పెట్టుకున్నాడు. తన కథలలోను, కవితలలోను, ఆమె అందాన్ని వర్ణనలుగా వాడుకున్నాడు.

ఆమె ఎప్పుడూ తల దించుకుని నడుస్తుంది. తల పైకెత్తదు. పక్కకు తిరిగి చూడదు. వెనుకకు అసలే తిరిగిచూడదు. మంచివాళ్ళకే భగవంతుడు ఎప్పుడూ కష్టాలు పెడతాడేమో: అందుకే ఈమెకు

## అంతర్యాం

భర్తని దూరంచేశాడా భగవంతుడు. బాధగా మూలిగేవి సత్యమూర్తి హృదయం.

రానురాను అతనిలో ఏదో కదలిక ప్రారంభమై, కలవరంగా మారింది.

మామూస్త్ర తిలకంతో... కళ్ళకు కాటుకతో... మెడలో మాంగల్యంతో... అభరణాల అలంకారాలతో... ఆమె మళ్ళీ సమాజంలో 'నాకూ భర్త వున్నాడు' అని తలెత్తుకు తిరిగేలా చేయాలి. అవును తాను అందుకు పూనుకోవాలి. ఆమెని పెళ్ళిచేసుకోవాలి.

స్థిర నిశ్చయానికి వచ్చాడు సత్యమూర్తి.

ఆ రోజు ఆమె అతనికి ఎప్పటిలా ఆ జంక్షన్‌వద్ద ఎదురుపడింది. అతనిని దాటుకుని ముందుకి వెళ్ళిపోయింది.

సత్యమూర్తి ఆమె దగ్గరగా వెళ్ళి —

"నమస్తే" అన్నాడు.

అతను హఠాత్తుగా పలకరించేసరికి ఆమె తొట్రుపడి ఆగిపోయింది. వెంటనే తేరుకుని తన తొట్రుపాటుని కనిపించకుండా "నమస్తే" అంటూ ప్రతినమస్కారం చేసింది.

"నా పేరు సత్యమూర్తి. కథలు కవితలు రాయడం నా హాబీ!" అంటూ తనని తాను పరిచయంచేసుకున్నాడు సత్యమూర్తి.

అతని పరిచయాన్ని వినగానే ఆమె చక్రాల్లాంటి కళ్ళు, ఆనందాశ్చర్యాలతో మరింత పెద్దవయ్యాయి.

"ఓ... మీరు రచయిత సత్యమూర్తి గారా!"

సత్యమూర్తి గర్వంగా ఫీలయ్యాడు.

నా పేరు "ఉష" చెప్పిందామె.

"ఉషగారూ! మీకభ్యంతరం లేకపోతే మీతో కొంచెం మాట్లాడాలి"

"అలాగే!"

ఇద్దరూ పక్కనేవున్న పార్కులోకి ప్రవేశించి, పచ్చికలో ఆశీనులయారు.

చాలాసేపు ఇరువురి మధ్య మౌనం రాజ్యంచేసింది.

"ఏదో మాట్లాడాలన్నారు. ఏమిటో చెప్పండి?" మౌనాన్ని ఛేదిస్తూ అడిగిందామె.

"స్త్రీకి అన్నిటికంటే విలువైనది ఏమిటి ఉష గారూ!?" సంభాషణకి నాందీగా ప్రశ్నించాడు సత్యమూర్తి.

"ఆత్మాభిమానం" అందామె

"కాదు...మరొకటుంది"

"ఏమిటది?"

"పసుపు కుంకుమలు" చెప్పాడు సత్యమూర్తి.

ఆమె నవ్వుకి, "అలా నవ్వుతారేంటి" అయోమయంగా అడిగాడతను.

"స్త్రీకి పసుపు కుంకుమలు అంత విలువైనవా?" ఆమె ఎదురుప్రశ్న వేసింది.

ఆమె అలా అడిగేసరికి సత్యమూర్తి వుడుక్కున్నాడు.

స్త్రీకి అవి ఎంత విలువైనవో తెలీదా?" అతని స్వరంలో కోపం తొంగిచూసింది.

"అసలు విషయం ఏమిటో ఉపోద్ఘాతం లేకుండా చెప్పండి" అందామె.

"ఉషగారూ ఇంత చిన్న వయసులోనే మీరు భర్తని పోగొట్టుకోవడం దురదృష్టకరం. నేను రోజూ మిమ్మల్ని చూస్తుంటాను. ఇంత చిన్న వయసులోనే వైధవ్యం ప్రాప్తించిన మీరు నిజంగా దురదృష్టవంతులు. ఎండి మోడైపోయిన మీ జీవన లతను తిరిగి పచ్చగా పుష్పింపజేయాలనుకుంటున్నాను. మిమ్మల్ని ఎప్పటిలా పసుపు కుంకుములతో చూడాలనుకుంటున్నాను మిమ్మల్ని నేను వివాహం చేసుకోవాలనుకుంటున్నాను"చెప్పాడు సత్యమూర్తి.

ఆమె పగలబడి నవ్వింది.

"సత్యమూర్తిగారూ! మీ రనుకున్నట్టు నేను విధవని కాను. నాస్తికురాలిని. అందుకే నేను హిందూమత అలంకారాలకు దూరం. ఇక నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకోవడంమాట అంటారా నేను నాస్తికురాలిని కాబట్టి మీ చేత తాళికట్టించుకోను. మనిద్దరం మామూలుగా కలిసి కాపురం చెయ్యడమే! ఇందుకు మీకభ్యంతరంలేకపోతే నేను మీతో జీవితమంతా కలిసికాపురం చెయ్యడానికి సిద్ధమే" చెప్పిందామె.

సత్యమూర్తి నిశ్చేష్టుడై ఆమెనే చూస్తూండిపోయాడు.



## వడ్డేపల్లి పదాలు

అటు పక్షం ఇటు పక్షం
అదే పనిగ మొండికేయ
ప్రతి పక్షం శ్రుతి చేసిన
'బంద్' కూడ మూగవోయె
సమన్వయం లోపించిన
చర్చలు ఫలించేనా?
ఎంతగాలి వీచినా
ఈతాకులు రాలేనా?
ఎంత జీతమిచ్చినా
స్జీవో మారేనా?

•



యవ్వనమ్మున మనిషి
జీవితమ్మున వెలుగు
కావొవత్తిలాంటిదే మనసా!
కావ్వకాస్తా కరుగ ఆరిపోయెడు
తీరు
కోరికలు అణగారు తెలుసా!